మూడు వలపులు

వెంపటి నాగభూషణం

మైడియర్ అన్నపూర్ణా!

ఏమిటి ఎన్నడూ లేని ఈవింత అని నీవు ఆశ్చర్య పడతావనుకుంటాను. ఎదురుగా కనబడుతూ ఉన్నంతసేపూ, ... "వదినా" అని ఎంతో ఆప్యాయనంగా, కులాసాగా పిలిచి వరుసలాడే మా సంపూర్ణానికి ఊరుదాటేటప్పటికల్లా, గర్వం హెచ్చిపోయి, సీమరాణీదర్జా వచ్చిందికాబోలు,— ఎంత పొగరుబోతుతనం! — అని నీవు అపోహపడటానికి కూడా ... వీలుఉన్నది. ఎన్నడూ లేనిది నిన్ను పేరుపెట్టి... ఇలా సంబోధించడంవల్ల...

కాని, తొందరపడక, ఉత్తరమంతా చదువు: నీకే తెలుస్తుంది...వదినా అని వ్రాయడానికి ఎందుకు మొగమాటపడ్డానో?

అసలు, ఈవిషయాలు తెలుపుకునేందుకే చాలా చాలాసిగ్గుగా ఉన్నది. ఇక్కడ, మామ్మ, అత్తా, చివరకు అమ్మకూడా నన్ను ఆషామాషీలు ఆడుతున్నారు. నానోటివెంట పలికించాలని ... ఎన్నోపన్నాగాలు పన్నుతున్నారు. తమాషాగా వెక్కిరిస్తున్నారు: కాని, నేను ఎక్కడా అంతు చిక్కనీయడం లేదు.

ఎందుకు...ఈ, ఉపోద్ఘాతము అంతాను అని నీవు విసుక్కుంటూ ఉంటావు: ఇంతవ్రాయడం నిన్ను అలయించడముకోసం కాదు:—నాస్థితి అర్థమయ్యేటట్టు ...వివరించడం చేయడానికి.

సిగ్గుతోపాటు తగని ఉడుకులుమోతుతనం కూడా నన్ను ముంచివేస్తూన్నది. అందరికీ, ఎద్దేవా చేయడానికి నేను ఒక్కరితెనే కనబడ్డానుకాబోలు.

మిగతావాళ్లందరి మాటాఎలా ఉన్నా, - నీవు కూడా, నన్నుతలచుకుని, - ఉత్తరం చదువుకుని, — హాస్యం చేస్తావేమోననే భయంతో,- "వదినా" అని వ్రాయడం మానివేశాను. అంతటితో నీవు ఆగేనకం అని కాదు,- (నీసంగతి నేను ఎరుగనిదికనుకనా)- అయినా, ముందుకాళ్లకు బందం అనుకో.

మీకు పట్నంబదిలీ అయినసంగతి ... మా, మామయ్యవచ్చి చెప్పేదాకా తెలియనేలేదు అన్నప్రకారం ఇక్కడకు రాగానే ఉత్తరం వ్రాశాను నీపేర. ఒకరోజు, రెండురోజులు ఎదురుచూశాను, జవాబు వచ్చిందికాదు: ఏమిటా అనుకున్నాను నీకు నామీద ఎందుకన్నా కోపం వచ్చిందేమోనని దిగులు పడ్డాను.

నీకేమమ్మా ఇంజనీరుగారి భార్యవు: ఉత్తరాల మీద ఉత్తరాలు ఉరికిస్తావు: నాకు నీలాగా కవిత్వం చేతరాదాయెను-చిలవలూ పలవలూ కల్పించి అల్లడానికి.

ఇక్కడికి, నిన్నటినుంచీ మొదలుపెట్టి, ఇవాళకు పూర్తిచేశాను ఈ ఉత్తరాన్ని! నీదగ్గర ఏసంగతీ దాచకూడదాయెను: కనుక్కున్నావా అంటే, ఆతర్వాత నన్ను నిలవనిస్తావా? కాని, మనసువిడిచి వ్రాయడానికి, అబ్బ! ప్రాణంచచ్చిపోతూంది. అయినా మాట అన్నతరువాత తప్పుతానా, ఏం? నీతోకాక, మనసిచ్చి, ఈ సంగతులు మరి ఎవరితో చెపుతాను! ఏమో, నీతోనైనా ఎదటపడితే ఇంత బెదురు లేకుండా చెప్పలేకపోయేదాన్నేమో!- ఉత్తరం కనుక బెరుకుతీరింది. ఏమోనమ్మోయ్! నీవు చదువుకుంటూ నవ్వుతూన్నట్టు నామనసుకు తోచినా, ఊరుకునేది లేదు: తెలిసిందా? — మళ్లావేసవికి మీరు మీమామగారియింటికి రాక ఎక్కడికి పోతారు? నేను వచ్చి చెవులు పట్టుకుని... ఊఁ... జాగ్రత—

మా మామయ్య ఇక్కడకు వచ్చాడన్నాను కాదూ? ఊరికే వస్తారా మహాత్ములు! వాళ్లఊరు ... (సిగ్గుపడి, దాటేస్తున్నాననుకోమాకు)... మా అత్తవారి ఊరు వెళ్లాడుట. అక్కడనుంచి శుభవర్తమానం పట్టుకువచ్చాడు:

గుమ్మంలో అడుగుపెట్టేటప్పటికే ఆయన వాలకం చూసి ఏదో ఉందనుకున్నాను. పల్లెటి దిక్కు మర్యాద చేద్దామని బులబాటంతో కాళ్లు కడుక్కునేటందుకు నీళ్లు తీసుకుని ఎదురువెళ్లేటప్పటికి చెంబు అందుకుంటూ, నావంక కొంటెగా చూసి - 'ఓహో, పెళ్లికూతురుగారా!' అని ఎద్దేవా చేశాడు. ఇన్నేళ్లు వచ్చి, మనమళ్ళి ఎత్తినా ఆయనచిలిపితనం మనం ఎరుగున్నదేకాదూ? నేను ఏమీ అనుకోకుండా నవ్వి ఊరుకున్నాను.

అంతలోకే మానాన్న ఆవేపు వచ్చాడు. ఒకరి నొకరు పరుసలాడుకుంటూ కుశలప్రశ్నలు వేసుకున్నారు.

'మీ అమ్మ ఏంచేస్తున్నదో, ఓమారు ఇలారమ్మనమ్మ!' అని మామయ్య వారి రహస్యాలోచనకు నేను అడ్డుపడకుండా నాకు పనికల్పించాడు. నేను లోపలకు వెళ్లిపోతూండగా 'శుభం అనిపించుకువచ్చానయ్యా బావా' అంటూ మామయ్య తన కార్యవిజయాన్ని గర్వంతో ప్రకటించడం నాకు వినిపించింది.

అమ్మతో మామయ్య వచ్చాడన్న కబురు చెప్పగానే ఆమె ఇంతై అంతై పసిపిల్లలాగు సంబరంతో గెంతుకుంటూ...సావట్లోకి ఒక్క పరుగుతీసింది. నేను ఆమెకని కెట్టకుండా వెనకాలేవెళ్లి తలుపుచాటున నక్కి చెవులు దోరబెట్టుకుని...ఏమి మాట్లాడుకుంటారో విందామని నిలుచున్నాను.

'ఏమమ్మా!' అన్నాడు మామయ్య: నాన్నా ఆయనా ఒకరి సరసను ఒకరు కుర్చీలలో కూర్చుని ఉన్నారు:

"ఏం నాయనా, అంతా క్షేమమేనా? - పిల్లను పురిటికి ఎప్పుడు తీసుకువస్తావు?...అబ్బిగాడు కులాసాగాతిరుగుతున్నాడా?.....చంటిది ఏమన్నా ఒళ్ళుచేసిందా?...ఎండలు మండిపోతున్నాయి: పోతపాలాయెను - మరి నూతిదగ్గర చెట్లకు...ఏమాత్రం కాయ దిగింది? మీకు సరిపోయిందా ఊరగాయకు....అయితే తోట యీయేడు ఎంతకు యిజారాకు ఇచ్చారు?..."

ఇలా, శరపరంపరగా ప్రశ్నలు కురిపించింది అమ్మ. సంగతులు తెలియక అనుకున్నావా?......దిటికొవేస్తే ఇక్కడ కాకి అక్కడ వాలుతూంటుంది: వారానికి ఓ సారైనా అక్కడివారు ఎవరోఒకరు వస్తూనేఉంటారు. ఇంతకూ...ఎన్ని ఏళ్ళువచ్చినా, ఆడవాళ్లకు పుట్టింటి మీద మమత పోదు...అదేం మాయో మరి (ఈవేదాంతం...ఏలాఉంది!)

ఈ ప్రశ్నలన్నింటికీ...ఒక్క తలఊపింపుతో సమాధానం సరిపుచ్చేశాడు మామయ్య

'అసలు విషయం చెప్పుమా? - మీచెల్లెలు చూడు...ఎంత ఆదుర్దాతో చూస్తున్నదో...' - అని మానాన్న...సంభావణ మళ్లేశాడు.

'ఏమిటి?...ఏం చేసుకుకొచ్చావు?...కాయా, పండా?'...అన్నది అమ్మ.

'పండుకాకపోతే...పండ్లు రాలవూ?......బావా నీవేనోయ్' అంటూ మామయ్య మళ్లా కొంటెతనంలోకి దిగాడు:

'నీ వెటకారాలకు ... ఏం కాని, సంగతులు చెప్పరా' అని బ్రతిమాలింది సోదరుణ్ణి మా అమ్మ.

'ఏం ఉన్నదమ్మా! మనం. ఎప్పుడు అవునంటామా అని...వాళ్లు కాచుకుని ఉన్నారు!—కోడలు యింటికి వస్తుందంటే...చేదా యేమిటి?—మామయ్య ఆరిందాతనం సాసాయించాడు:

'పిల్లవాడు ఏమన్నాడు?'—అని అమ్మ మళ్లా అందుకుంది.

'ఏమంటాడు? తీపెళ్లిందాయేం? రొట్టె విరిగి హైయంగవీనంలో పడుతూంటే?- (మామయ్యకు ... ఎంతగీర్వాణ మనుకున్నావేమిటి!)-మొదట కొంచెం పెంకెతనం చేశాడులే. అంటే, ఏంలేదు: ఇదిగో ఈ మధ్యవచ్చినాయిచూడు - భావకవిత్వాలు, అర్థం ఖర్థం ఉండదే! అందులో మనవాడికి పరిపూర్ణ పాండిత్యం కుదిరింది. తాను యీమధ్య వ్రాసినవట, ఓమోపెడు కాగితాలు, ముందువేసుకు కూర్చొని, చదివి వినిపించి,-

ఆ పూటంతా, హతమార్చేశాడు: అదేమిటో...దోవా తెన్నూ లేకుండా ఉన్నాయి: ప్రియురాలా, ప్రియురాలా అని ఒకటే ఏకపుధోరణి!-చిలకలు, వెన్నెల, కోవెలలు, చకోరాలు,-అంతా కలగలపు కవితాపాకం తయారు చేశాడు. 'ఇదేమిటోయ్'-అని నేనంటే,-'అంతే లెండి, మీకు తెలియదు:' అని నాముఖంమీదనే అనేశాడు: అదో వాలకం.'-మామయ్య ఇంకెంతసేపు అలా లెక్చరు దంచేవాడో కాని,...అమ్మ...వింటూన్నకొద్దీ కళ్లనీళ్ల పర్యంతమై:

'ఎవతె అన్నా మాయచేసిందేమోరా నాయనా: ఏమిటిదారి?'-అని బావురుమన బోయింది...అమాయికంగా. నాన్నా, మామయ్యా ఫక్కున నవ్వారు:

'వెర్రిపిల్లా! అదేమిటే? ... మునిగిపోయిందేమీ లేదు. ఇవన్నీ పైపెచ్చువేషాలు కాని,...కార్యంమాట చెప్పేటప్పటికల్లా...ముసిముసినవ్వులతో, - లాంఛనం కోసం కొంచెం బెట్టుచేసి, చివరకు,-మౌనం అర్ధాంగీకారం అనుకోమన్నాడు. వాడి మొగం కాదూ: మనపిల్ల దగ్గర జేరినతర్వాత, మూడునిమిషాలలో వంచకపోతే, బొమ్మను ఆడించినట్టు ఆడించకపోతే, అప్పుడు అను. నీ కూతురు ... సామాన్యురాలనుకున్నావా ఏం?...ఏ సినీమాలోకో పంపితే, ఈపాటికి...అదెవరూ...ఆఁ...గోహర్ అంతది అయ్యేది:'

మామయ్యమాటలకు, ...అందరూ...ఏదో ఘనకార్యం చేస్తూన్నవాళ్లలాగా విరగబడిపోయినారు. నేను, ఇక అక్కడ నిలవకుండా, వెళ్లిపోయి గదిలో మంచంమీద బోర్ల పడుకున్నాను...

నాకు, మనసులో-కొంచెం కష్టంగా, భయంగా, సంతోషంగా, పెద్దదిగులుగా,-అదేమిటో సరిగా చెప్పలేకుండా ఉన్నాను- తమాషాగా అనిపించింది. ఏమీ ఆలోచనపోలేదు. ఒంటికి ఉష్ణంవచ్చినట్లు...కొంచెం పులకరింతగా తోచింది: కాని, బద్ధకం లేదు. ఎండావానా లాగా, ఉండుండి పెద్దభయం: అంతలో, అదంతాపోయి తగనిసంతోషం! ఏమిటో, ఏలాఉన్నానో అప్పుడు....వ్రాయలేను....

...అప్పటికి యింకా మూడురోజులు ఉన్నది,-నాచేత జాంబూనదతోరణం దాటించడానికి గడువు. ఇంటిల్లిపాదీ, కోలాహలంగా, వైభవంగా ... ప్రయత్నాలు చేస్తున్నారు. నాకుమట్టుకు ... ఏమీతోచేది కాదు: బయటికి నలుగురిలోకీ రా మనస్కరించేదికాదు. పోనీ, నేను తలదాచుకు ఉంటున్నానని ... వాళ్లు ఏమన్నా నిలువనిస్తేనా? పనిలో పనికల్పించుకుని, -ఓమారు మామయ్య, ఓమారుఅత్తా...(సమయానికి ఆవిడె కూడా ఊడిపడ్డది, నాప్రాణానికి!)... ఏదో చిలిపిమాట అనో, చక్కలిగింత పెట్టో...పోనూ, రానూ....

చదువుకున్నదానవు, బుద్ధి తెలిసినదానవు.... అంతసిగ్గు ఎందుక — నీవు ఆక్షేపిస్తావేమో? అది అంతాసిగ్గుకాదు: నాసంతోషం వాళ్లుచూసి.... మరీ పరిహాసంచేస్తారేమోనని,...సగం అభినయం అందులో! లేనిసిగ్గయినా తెప్పించుకుని ... పడకపోతే, ఇదెక్కడి చిత్రాంగి అని అమ్మలక్కలు అందరూ ముక్కున వ్రేలు వేసుకుంటారుకదూ, మరి?...

ఆవేళ...

ఇంకా, కనుచీకటిఉండగానే,... నిదురమబ్బు వదలకముందే, బలవంతాన నన్ను మేల్కొలిపి,— తలంటిపోశారు. దేవకాంచనంచాయ పూనాసిల్కుచీరె-(మా నాన్న కొత్తగా కొన్నది)... కట్టుకుని, జరీలేసువేసి కుట్టుకున్న కరాచీపట్టురవిక...(అక్కడకు వచ్చినప్పుడు నీకు చూపించలా?— అదీ...)...తొడుక్కున్నాను. కుంకుమ పెట్టుకుందామని అద్దంముందర నిలుచునేటప్పటికి... ఎంత ముద్దొస్తూన్నా ననుకున్నావు?...పెదవులూ, కళ్లు, మొగమంతాకూడా... కలకలా నవ్వుతూన్నట్టు అనిపించింది! నాకే ఆశ్చర్యంవేసింది ... ఆలా మారిపోవడంచూసి!

తలచిక్కుతీసుకుని... వదులుగా ... అయిదుపాయలజడ అల్లుకుని,...ఎవరూచూడకుండా ... మా చిన్నతమ్ముడ్ని బెల్లించి, వాడిచేత కాఫీ తెప్పించుకుని తాగాను. మొదట, అమ్మను అడిగితే ... పీటలమీద నుంచిలేచేదాకా పరగడుపుతో ఉండాలన్నది. రాత్రి

కూడా అన్నం సయించలేదేమో, ... కాఫీత్రాగందీ ఉండలేకపోయినాను:

తొమ్మిదిగంటలైంది: అంతవరకూ నన్ను పలుక రించినవారు ఎవరూ లేరు: అసలు, ఎవరికీ కనబడకుండా ఉండాలని,... నీలాంబరం చెట్లదగ్గిర పెక్కామీద, దాక్కొని కూర్చున్నాను. అప్పుడు—తలవనితలంపుగా ఏంజరిగిందో చెప్పనా?... మాఅమ్మ బిగ్గరగా గొంతు పెట్టుకుని, ఎవ మీదనో, దొడ్డివైపున కేకలువేస్తూంటే, ... ఏమిటో చూద్దామని అలా వెళ్లాను. ఆవిడ, రుంజుకుంటూ లోపలికి వెళ్లిపోయింది. నేను ఆమెవేపే చూస్తూ కొంచెంసేపు నిల్చుని,... చూపు మళ్లింతును గదా!... ఒట్టు! . అంతకుముందు నేను గమనించనే లేదంటే నమ్ముతావో లేదో?... ఈలంటిపోసుకుంటూ ఆయన ఉన్నారు, కొంచెందూరాన!

నేనుచూశాను: నన్ను ఆయన చూసేఉంటారని నమ్మకం. వెంటనే, ఉలిక్కిపడి... పరుగెత్తుకువచ్చేసి, ఎవరికీ కనపడకుండా దాక్కున్నాను. అప్పుడుకనుక ఎవరన్నా చూసినట్లయితే, నవ్వు మొగంతో...దొంగను దొరికిపోయేదాన్నే!...

...తొమ్మిది...పది...పదకొండు...

బ్రాహ్మణులు మంత్రాలన్నీ చదివి వదిలేప్పటికి పొద్దుపోయింది:... నాకు, హోమందగ్గర కూర్చున్నప్పుడు, పొగపోయి, చాలాసేపటివరకూ కళ్లు తెరపిడిపడనేలేదు. అందువల్లకాకపోయినా, ఏమో... అన్నం బొత్తుగా సయించలేదు: భక్ష్యాలన్నా తినమని అమ్మ బ్రతిమాలినా,... నేను వాటిని నోట పెట్టనేలేదు ...

—ఇక, మావాళ్లు అందరూ నన్ను సింగారించడానికి ... పంతంవేసుకుని...వంతులు తెగక...రావణా యుద్ధం చేశారు:

ముందు...జడవేయడం పూర్తి అయ్యేటప్పటికే—సగంపట్నం కొల్లబోయినట్లయింది: ప్రొద్దుగ్రుంకింది: తోటలోనుంచి, ఏకబారుమొగ్గగా పురమాయించితెప్పించిన బుట్టెడు మల్లెపూలూ, జడమీద కుట్టించాలని—మాఅత్తపంతం. నేనువద్దంటే వద్దన్నాను: మెడలు పడిపోతాయి జడమోసేటప్పటికని: ఆవిడెకు తనమాట నెగ్గలేదని... కోపం, ఉక్రోషం... వచ్చినై!... "ఈ కాలంవాళ్లబుద్ధులుఇంతే: చెపితేవినరు: వినసేర్పు ఉంటే కాదూ?... అయినా, తనుదునమ్మాయంటూ ... నేను పట్టుకు ప్రాకులాడటం ఎందుకు? ... ఎవరియిష్టం వారిదీ!..."— అంటూ మాఅత్త రుసరుసలాడి, బుంగమూతిచేసుకుని, ఓమూలకుపోయి కూర్చున్నది....

వంకీజడవేయడానికి ... సభ్యులందరూ సమ్మతించారు: "కుట్టుపని అయితే బోలెడుఆలస్యం: ఇప్పుడు తెమలదు: రేపుఎప్పుడన్నా పెందరాళే తలపెట్టవచ్చునులే...అంతగా నీకుచూడాలని మనసు అయితే: పైగా, కుట్టుజడఅయితే పక్కలోనుచ్చుకుంటుంది కూడాను: ఇవాళకు అమ్మాయిచెప్పినట్టే కందాము:" ... అని మాఅమ్మ... అత్తను సమాధానపరచింది ఆ...బులబాటపు అమాయిక... ఇకఅంతటితో ముకురుతనంమాని వేసి, సరదాగా...దగ్గరకువచ్చి కూర్చుని, పూలుబొత్తిగా అందుకుని జతచూసి అందీయడం ప్రారంభించింది. వాలుజడఅంతా అల్లేసి, పాయలచివర జరీరిబ్బన్ 'బో'కట్టి... నవరకట్టుక్రిందుగా జడబిళ్లతిప్పి, ముచ్చెల ఈనెపాయలలో సంపెగలూ, గులాబీలూ తురిమి, నన్నొక బొమ్మనులాగా, అందరూ తలొకవైపునా దూరదూరంగా నిలుచుని, ... తమ ప్రయోజకత్వం చూసుకుని, మురిసిపోయినారు.

అంతటితో, బ్రతికి బయటపడ్డానుకదా అని ...లేచి, మేజాముందర నిలుచుని... ఎదుటి అద్దంలో చేతిఅద్దంలో ... ప్రతిబింబం ఆధారాన గులాబీలు సవరించుకుంటూండగా, ఇంకోతవాయ్ వచ్చింది. ఇకిలించుకుంటూ, ఆ...రుద్రాక్షమాణిక్యం ... (పెద్దదైతే అయిందికాని, వళ్లుమండుతూంది...)-మామ్మ ప్రత్యక్షమైంది...

—కనుబొమలమీదుగా ... పతాకహస్తం బోర్లగిల అడ్డంపెట్టుకుని, నన్ను పరకాయించిచూసి.. "జడ సొంతం అయింద్రా?"—అని గంభీరంగా అడిగేసరికి,...అమ్మ సమాధానం చెప్పింది — అవునని.

"అయితే"—అని, ఏదో అస్పష్టంగా తనలో తాను అనుకుని,... ధోవతి కొంగుచాటునుంచి తీసి గుప్పెడు తలసామాను పట్టిచూపించి... 'ఇవికూడా పెట్టండే! ... అంటూ, సమీపాన ఉన్న అత్తకు అందిచ్చింది.

అంటున్నదే కాని, చొరవ చేయడానికి అత్త అనుమానించి,— అమ్మవంక చూసింది. ఆవిడే ఏమీ మాటాడలేదు. అంతలో నేను కల్పించుకుని, ... "భామవేషంలాగ ఉంటాను ... ఆపాపట చింద్రీలూ అవీ వేసుకుంటే: నాకు అక్కర్లేదు..." అన్నాను నిర్మొగమాటంగా: "వేసుకోవాలి: వద్దనకూడదు. మనకు అచ్చివచ్చినవి: మా పుట్టింటివారి తాలూకు ఇవి: నేను వేసుకున్నాను. పంతంటికొడుకును ... బంగారు తండ్రిని మీ నాన్నను... కన్నాను: మీ అమ్మకు వేశాను: ఏం, నిక్షేపంలాగా కాపురం చెయ్యడంలేదూ! ... చెడిపోక, చెప్పినమాట విను: పెద్దదాన్ని ... ఇంతగా అంటున్నది ... నీ కోసం నీకే..." ఇలా సంత ఉపక్రమించింది. నాకు తిక్క వేసుకువచ్చి బంగారు తండ్రీ అక్కరలేదు, ...నీ పాపట చింద్రీలూ వద్దు"—అని ధూకుడుగా, నిష్కర్షగా అనేసరికి, ఆవిడే: 'ఆఁ...ఆఁ...ఎంత పోతరమే! మీ బుద్ధులూ మీరూను!... పిల్లాపీచూ లేకుండా, ఎల్లకాలం మొగుడితో కులుకుతూ ...' ఇక మాతక పదసలోకి దిగి... వెనక్కి తిరిగింది. ఆమెను ఉడికిలించాలని,... "మక్కువ తీరకపోతే ... నీవు వేసుకో..." అని విసిరాను. అమ్మా వాళ్లందరూ బిగ్గరగా, విరగబడి నవ్వారు...

వెళ్లిపోతూన్న వృద్ధావతారం రివ్వున మళ్లీ... 'ఏమన్నావూ?...నీ మహా వైభవంలో, చిన్నా పెద్దా తారతమ్యం తెలిసేటట్టుఉందా? ... నేను వేసుకోవాలీ... మీలాగా అనుకున్నావేం? — ఆ మహారాజు ఉన్నన్నాళ్లూ...బతిమాలి, ఎంతో ముచ్చటపడి వేయించేవారు! నిర్భాగ్యురాలిని కాబట్టి, ఆయన వెళ్లిపోయినా పోమ్మొ...' ఇలా, వింత ధోరణిలో, మా అత్త పుటకలకు పోయిన తాతను తలచుకుని,... నేడో రేపో, పూర్ణయాత్రా స్పెషల్‌లో ... స్వర్గానికి ప్రయాణం కట్టబోతూన్న... (వాళ్లమ్మ కడుపుచలువలు ...

ఇంతటిలో అంతపని జరిగేటట్టు తోచడంలేదు కాని, మామ్మ వగలమారి విచారం అభినయించి, నిష్క్రమించింది.

ఆవిడకు ఇంకా నామీద కసిగానే ఉన్నది ... చెప్పినట్టు అలంకరించుకోలేదని: అయినా, మించిపోయింది ఏమిలే?...బంగారు తండ్రిని ఎత్తాలని మనకు పుట్టినప్పుడు, ...మామ్మను అడిగి, ఒకమారు అవన్నీ తలలో అలంకరించుకుంటాను!...ఏమో, వాటిలో ఎంత మహాత్మ్యం ఉన్నదో?...ఏమంటావు?...

...నీళ్లు పోసుకున్నాను...(తప్పుగా అర్థం చేసుకోకేం)...వంటిమీద: ఉన్న నగలు తీసేసి, ముత్యాల లోలకులు, హారం, గాజులూ...అలంకరించుకుని, దంతంచాయ సిల్కు చీర కట్టుకుని, బాడీమీద గులాబీ సిల్కు గాజ్ జంపర్ వేసుకున్నాను. అద్దం ముందు నిలుచుందునుకదా,...కదలబుద్ధి పుట్టిందికాదు. ఎంత,... ఎంత అందంగా ఉన్నాననుకున్నావు, అప్పుడు?

మేడమీద ... రణగొణధ్వనిగా ఉన్నది: ఏం చేస్తున్నారో తెలుసును. అలంకరణ శాఖాధ్యక్షురాలు- అత్త, మధ్యాహ్నంనుంచీ ఉమేజువారీ చలాయిస్తూ, ఎన్నివందలసార్లు మేడమెట్లు ఎక్కి దిగిందో... చెప్పలేను. ఆవిడ సంబరంచూస్తే ... (అనగూడదుకాని...)... బాలవైధవ్యంమూలాన, తీరనికోరికలన్నీ... ఆనాడు మానసికంగా హాయితో అనుభవిస్తున్నదా...అనిపించింది!

—తొంగిచూడాలని బులబాటంవేసి, ఎవరూ చూడకుండా,... మేడమీదకు వెళ్లాను. గదితలుపులు అన్నీ వేసుకుని లోపల వాళ్లందరూ గూడుపుఠాణీ చేస్తున్నారు. లాభంలేక తిరిగివచ్చేశాను: మొదట, ఏదో వంక బెట్టి తలుపు పిలుద్దామనుకున్నాను కాని,... గుండె దడదడలాడింది...

చీకటిపడుతూండగా...భోజనం చేశాను: 'వ్యవధి లేదు...త్వరగా తెమలాలి...' అంటూ, నాన్న అందరినీ తొందర బెడుతున్నాడు. అమ్మ నన్ను చెయ్యిపట్టుకు తీసుకువచ్చి...సావడిలో, ఆయనసరసను కూర్చో

బెట్టింది. బ్రాహ్మణుల గొంతులన్నీ ... ఏకస్థాయిని మోగిపోయినవి.

లేచి...వెళ్లి...చుట్టుగోరంచు ఉప్పాడజరీ చీర కట్టుకుని, తిరిగివచ్చి కూర్చున్నాను...పౌరోహితుడు చెప్పిన ప్రకారం. ఈమారు...ఇంకో క్రొత్తయిదువ ఆసలాతో...పురోహితుడు నాచేతికి తాంబూలాలు పేర్చినపళ్లెం అందిచ్చాడు...

వారు,...మావారు...ఎడమచేతితో నన్ను కౌగిలిలోకి తీసుకున్నారు! ఇది...సంప్రదాయమట కాదూ! ముందు జరగబోయేపని... దేనని ఈ బ్రాండసగం ధర్మ్యాల ఎదుట ప్రదర్శిస్తేనేకాని...శాస్త్రం ఒప్పుకోదేం?...విచిత్రం!

నీకు ఈకలాపమంతా...క్రొత్త అని కాదు—ఇంత విపులంగా వ్రాయడం. అప్పుడు నీవు ఏమనుకున్నావో నాకు తెలియదు—నీవు ఎన్నడూ చెప్పలేదు కాబట్టి. కాని మనపిల్లలన్నా...ఈకంచనేనన్నీ పడకుండా...!—పెద్ద కబుర్లుచెపుతున్నానని ఎక్కిరించబోకు. బోనులో చిక్కినట్లు అసహాయనై...ఏం చేయలేకపోయినాను. ముందుగానే...ఇలాటి సంగతి అని తెలిసి ఉంటేనా...?—సరి, ఏం అనదానికి... ఏంచేస్తాములే...

పునస్సంధానాన్ని ..... చిన్న వీధినాటకంక్రింద తయారుచేయడం...ఆర్షమర్యాద అయితే...ధిక్!... ఆశీర్వచనాక్షతలజడి వెలియగానే ముత్తైదువలు తామమ్మల్ని కమ్మేసి... మేడమీదకు తీసుకువెళ్లింది. పాన్పుమీద అభిముఖంగా కూర్చోబెట్టి, గంధంపూయించి, ఎంగిలి పరమాన్నం త్రాగించి...(నేను త్రాగినట్లు నటించాను కాని, నిజంగా త్రాగాననుకున్నావా ఏం?)...ఫలప్రదానాలు కాజేసి, మబ్బుపింజెలులాగా ఎక్కడివా రక్కడ మాయమైనారు...

మరి పదినిమిషాల...పావుగంటకు...గదితలుపు బయట గొళ్లెం బిగించినట్టు శబ్దం -

...నేను తలవంచుకునే......అలా కొంచెంసేపు మంచంమీద కూర్చున్నాను: ఆయన నావంక చూస్తున్నారేమోనని...సిగ్గు. ఆయనను చూడవలెనని మనసులో కోరిక:

నెమ్మదిగా తలఎత్తి...ఓరకంటచూసి.....తలవంచుకుని, అలా రెండు మూడు సార్లుచూశాను: ఆయన దిండ్లకు చేరగిలబడి...ఏదో ఆలోచిస్తున్నట్టుఉన్నారు. నేను క్రిందకు దిగి నిలుచున్నాను - బొటనవ్రేలితో తివాసీ నెమ్మదిగా రాస్తూ. నావంక అయినా చూడకుండా పరధ్యానంగావెళ్లిపోయి వెన్నెల మీద పడేటట్టు...కిటికీదగ్గర నిలుచున్నారు. నేను ఉన్నచోటనే కదలకుండా ఉన్నాను:

వెనక్కు తిరిగి వస్తారేమో ననుకున్నాను: కాని ఆయన కదలలేదు, మెదలలేదు...

బల్లమీద రకరకాల పళ్లాల్లో...అందంగా అమర్చబడ్డ ఫలహారాలు - (అదంతా......అత్తపని...) - నోరూరించినవి. అడుగులో అడుగు వేసుకుంటూ, సద్దు చేయకుండా...అక్కడకువెళ్లి, కావలసినవితిని, మంచి నీళ్ళుత్రాగి...కొంచెం వక్కపొడి...ఒక చిలక దొంగతనా వేసుకున్నాను...

కిటికీతలుపుమీద చేతులు బారసాచి...ఆలోచిస్తూన్నారో, లేక...ఏమున్నాచూస్తున్నారో కాని ఆపోజులోనే...నిలుచునే ఉన్నారు: ఏమిటో ఆవిశేషం అని...నేను పక్కకిటికీ దగ్గరకు వెళ్ళాను.

వెన్నెల...బయట చాలా అందంగా ఉన్నది: చూస్తుండగా...నాకే చూపు మళ్లించుకోడానికి బుద్ధి పుట్టిందికాదు: అయితేమాత్రం...

ఆయన అక్కడనుంచి కదిలారు. ఏంచేస్తారో చూద్దామని...రెక్కకు మెరుగం చాటుచేసుకున్నాను. అనుకున్నాను...నాదగ్గిరకు వస్తారేమో ... బుజంమీద చెయివేసి పలుకరిస్తారేమో, ... ఇంకా...ఏమో ...

మళ్లినత్రోవనే, పంతము పట్టినట్టు నావంక అయినా చూడకుండా బల్లదగ్గరకు వెళ్లికూర్చుని, ఏదో ఏకదీక్షతో వ్రాసుకోవడం ఆరంభించారు:

చెప్పద్దూ...నాకు కొంచెం చిరాకూ, కోపమూ వచ్చినవి. నేను...గదిలో ఉన్నానన్నస్పృహ అయినా

లేకపోయె! సుమంగలు లందరూ ఆశీర్వదించి.... ఒంటరిగా మమ్మల్ని వదిలి వెళ్ళింది...ఇలా దాగుడు మూతలాడుకుంటూ...ఒకరికొకరు వైదొలగి పచార్లు చేయడానికా?...ఒకవేళ కాళిదాసు సోదరుడేమో అనుకుందామా అంటే? ఊహుఁ...

నేను మనసులో యింక గుంజాటనపడుతూన్నా ఆయనకు చీమకుట్టినట్లైనా తోచలేదు. వ్రాస్తూనే ఉన్నారు...బ్రహ్మవ్రాత! - పగలల్లా బారసేశాను... దీపం పెట్టరా దిగసేయాలి...అన్నట్టు! ఇప్పుడు ఏమంత ముంచుకు పోయిందని, ఏం మునిగిపోతుందని... ఆ వ్రాత?

బాగా కోపంవచ్చి ... క్రిందికి వెళ్ళిపోదామను కున్నాను: కాని, బయట కిటికీకంతలగుండా చూసి పుణ్యం సంపాదించుకునేందుకు కాచుకున్న మూక ... తలుపుతీస్తారా? అయినా, వెళ్ళి వాళ్ళల్లో పడటంకన్న ... గదిచెంపసాలే మంచిది అనుకున్నాను...

ఉద్వేగంతో, పెన్సిల్‌తో కాగితం మీద గీతలు గీస్తున్నట్టు బరికి,... దాన్ని విసిరివేసి, ... ఈల వేస్తూ, — నాతపఃఫలము ...కూర్చున్న చోటునుంచి కదిలి, మళ్ళా కిటికీని ఆశ్రయించింది.

నేను తాపీగా...బల్లదగ్గరకు వెళ్ళి, కాగితం అంను కున్నాను. అంచున, అజంతా పద్ధతిలో — (ఇప్పటికీ, అయినవాళ్ళకూ ... కానివాళ్ళకూ అదే కామా మోజు) ఒకచక్కని పిల్లబొమ్మ ... ఎంత అందంగా వేశా రనుకున్నావు? ఆ కాగితం దాచేశానులే, ... ఈమారు ఎప్పుడన్నా వచ్చినప్పుడు చూద్దువు కానిలే.

...ఆ బొమ్మ సరసను... ముత్యాలలాంటి అక్షరాలతో...సగం నడచిన...యీపాట:

'ఇది మరియాదా-
నీ...వంచనలకు ఇక
బదులు తీర్చలేనా...
ఎంతజాణవైనా...నీ—కిది
మరియాదా, మరి...కాదా-
కలలోనైనా...వలసిపిలచినంతనె
పలుకనైతినా...కలవరమందితినా-
నిలుకడమాటే ఎరుగని...నీమాయలు

—పూర్తిగా ఆలోచించడానికి కాబోలు... మళ్ళా వెన్నెలలోకి వెళ్ళింది! ఇన్ని అందాలవగలు తెలిసిన వారేనా, మరి...బయట వెన్నెల కాస్తూన్నా, పక్క గదిని అడవిచేసేస్తున్నారు?...అనిపించింది.

ఒక్కమారుగా లైటు స్విచాఫ్ చేశాను ... ఇప్పుడన్నా వెన్నెలఎక్కడో, ... నేను ఎక్కడో తేలాలి ... అని.

కాని, తేలేందుకు...ఆయన కదిలితేనా, తెలివి తెచ్చుకుంటేనా?

కొంచెం మెసిలారు: నేనుధైర్యంచేసి, - (స్వయం దౌత్యమేననుకో,... మరి ఏంచేయను?— 'కాంతుడు సిబ్బతికాడై కాంతయునల్లైన ఎట్లుకాపురమింకన్?')- 'మంచినీళ్లు కావాలా?' ...అన్నాను నెమ్మదిగా, వినయంగా... ప్రాతఆచారాన్ని అనుసరించి: మరి, కొత్త పోకడలూ, అలంకరణములూ పనిచేయనప్పుడు... గత్యంతరం?

'కావాలి'... అన్నారు, నావంక చూడకుండానే:

అందిచ్చేటప్పుడు పరాకున—(నిజంగా చేయాలని చేయలేదుసుమా...)— ఆయనచేతివేళ్లు నాచేతికి తగిలి, ఒళ్లు ఝల్లుమన్నది...

ఆయన ఏమనుకున్నారో యేమో — నావంక ఏలా చూశారనుకున్నావు? పరవశనైపోయినాను! ఫరవాలేదు!... ఇక కౌగిలిలోకి తీసుకుంటారుగదా... అమ్మ! ..

ఊహుఁ...! ఆరాతిగుండె కరిగితేనా? ఎందుకో అంతనిగ్రహం... ఋషులనుగూడా మించిపోయి?

'కూర్చో...'

ఆయనకూర్చుని...పక్కకుర్చీ చూపించారు: నేను చొరవచేసి...ఆయనకుర్చీ చేతిమీదనే కూర్చున్నాను.

'వెన్నెల ఎంత అందంగా...ఉన్నదో...'

—ఏం సమాధానం చెప్పను?... నాకుమటుకు కనబడటం లేదూ?

'అలా, మైమరచిపోయి, వెన్నెలలో నిలుచుంటే ఎన్ని మనోహర భావాలు వస్తాయనుకున్నావు? జీవితంలో తీయదనము చవిచూడటానికి...'

—నా మనసు అప్పుడెంతగా ఉవ్విళ్లూరిందో... ఏ దేవతైనా తెలియజెప్పకూడదూ...

'...మానసిక అనుభవాలతో దోహదం చేసుకుని కాలం వ్యర్థపుచ్చకుండా...'

ఇప్పుడు...తాను చేస్తున్నది...ఏమిటో?

'...సామాన్య లౌకిక భోగాలకు ఏమిలే... ఆ రాదుపకారకములే కాని...'

ఈ ధోరణి వింటూన్నకొద్దీ నాకు మతిపోతూన్నట్టుంది: అరసికుడికి ఇంత పెద్ద కబుర్లు ఎందుకూ—ఉట్టికెక్కలేనమ్మ సామెతగా?

లేకపోతే, అంతా గడుసుదనమా...నాచేత బ్రతిమాలించుకోవాలని? నేను లొంగుతానా?...నాకు మాత్రం చాతుర్యం, జాణతనం లోటా?

భావకవిత్వ సిద్ధాంతాలన్నీ...ఎంతసేపు చెప్పారో,...నేను, అవును-కాదు అనకుండా, శిల్పంకొట్టిన రాయిలాగా...వింటూ, మధ్యమధ్య కొంటెతనానికి, మేజామీద పూలచెల్లుతుంచి, ఆయనమీద రేకలు చిమ్ముతూ,...ఎప్పుడో తెలియకుండానే, భుజంమీద వ్రాలి...నిద్రపోయినాను. ఆమానవుడు, పాపం!... వేమపెళ్లికూతురులాగా...తెల్లవార్లూ నాకు ఆసలాగా, అలాకూర్చునే ఉన్నారనుకుంటాను...

-బయట ఎవరో దడదడమని తలుపు ఊగించేసరికి, ఉలికిపడి మేలుకుని, క్రిందకు జారి నిలుచుని, పైటసరిజేసుకుని, ... మబ్బుతీరేందుకు చెంగుతో కళ్లు తుడుచుకున్నాను.

మళ్లా...తలుపు చప్పుడైంది. తీయనా-వద్దా?... ఇట్టే, కిటికీవైపు చూతునుగదా...తూరుపు తెలవారుతూన్నది!

వెళుతూన్నానని చెప్పదామని నోటిదాకా వచ్చి,...అంతలో సిగ్గుపడి, తలవంచుకుని, ఆయన చూసేటట్టు...ప్రభావతిలాగా తల ఊగించాను.

చెయిజాచి...నాచెయి పట్టుకోబోయినారనుకుంటాను...లేకపోతే, బద్ధకంతో ఒళ్లు విరుచుకుంటే నేను అలా అర్థంచేసుకున్నానో?...ఏమైతేనేం, ఆ సుఖానుభూతి యాథార్థ్యం తేల్చుకునేందుకు ఆగకుండానే...పెళ్లి, తలుపుతీసుకు బయటపడ్డాను...

క్రిందకు పోతినిగదా,...అక్కడ ... ముసలి-పడుచు విచక్షణ లేకుండా,...స్త్రీగణమంతా నన్ను కమ్మేసి, ఎన్ని కిలికితనాలు చేశారనుకుంటావు? ప్రత్యంగ పరిశీలనం మొదలుపెట్టి, కసుగందని సౌకుమార్యవిలాసానికి ఆశ్చర్యపడతూ, అపార్థాలు తీసి, మీమాంసచేస్తూ...నన్ను రెట్టించారు-ఏంజరిగిందో?... ఏమీ జరుగకపోతే ఎందుచేత ...చెప్పమని? ఇంతకన్న అన్యాయం ఎక్కడన్నా ఉన్నదా అన్నపూర్ణా?

నోటిముత్యాలు రాలుతాయేమోనన్నంత జాగ్రత్తతో, పెదవికదల్పకుండా...ఊరుకున్నాను. కాని, కథలల్లేవారికి...విసుగూ విరామం ఉంటేనా? అందరూ మూలమూలలజేరి, అల్లుడు రాత్రి సరిగా ఉండలేదని...గుసగుసలు ప్రారంభించారు. అత్త... నాకంక చాలా జాలితో, అనుతాపంతో చూసింది: బావురుమంటానేమో, దగ్గరకు తీసి సముదాయించి,... నాతోపాటు నా దురదృష్టానికి విచారపడి-మనశ్శాంతి చేసుకోవాలని...ఆమెకోరిక అనుకుంటాను. నేను తొణకలేదు. ఎవ్వరికీ అవకాశం ఇవ్వలేదు...

* * * *

రెండో నాడు:

పగలంతా...ఏమీ విశేషము లేకుండా, మామూలుగానే గడచిపోయింది. ఆయన నాకు...కంటికి కనబడనేలేదు. నేనసలు కూర్చున్నచోటునుంచి కదలనేలేదులే! పైగా రాత్రి నిద్ర చాలనందువల్ల, భోజనం కాగానే...సాయంకాలందాకా నిద్రపోయినా ఇంకా బద్ధకము వదలనేలేదు;

చీకటి పూర్తిగా పడకముందే,...క్రిందటిరోజు కన్నా...ఇంకా ఎక్కువ అందంగా అలంకరించుకున్నాను

జాజిపూలతో డైమన్ జడవేసుకుని,...చంపకమాల కత్తెరదొంతర అర్ధచంద్రుడులా...అమర్చుకున్నాను. అన్నీ రవలసొమ్ములే...పెట్టుకున్నవి! ఏలా ఉన్నాననుకున్నావ్!...నీవు చూసినట్లయితే,...నిన్ను మగవాణ్ణిగా చేయనందుకు బ్రహ్మను చెరిగేసి,...కొరుక్కుతిందామని కలియబడక పోయినావూ?

... ఏం లాభం ? ... అన్నిలక్షణాలూ ఉన్నాయి కాని... అల్లుడి నోట శని... వదలలేదు. ...

చీకటిపడి, దీపాలవెలుగున క్రమంగా ముదిరిపోయింది. ... ముత్తైదువలందరూ ... ద్వితీయ విఘ్నం కాకుండా హాజరై ఫల ప్రదానాలు తన్నుకుని, జారిపోయినారు. వయసుకత్తెలు ... వర్షియాంసినుల చాటు మాసుకుని,...మనసులో ... తీరనికోర్కెలన్నీ ... వరుసపాటలలో చిసురించుకొని... పులకరించి, ... మమ్మల్ని ఎలాగైతేనేం చివరకు...దయతలచి ... ఒంటరిగా వదిలిపెట్టారు. మాఘలేఘు కదా చన...అని కృష్ణుడు మొరాయించినట్లు, గుర్రం గుడ్డిదైతే మాత్రం... దాణాచెల్లడానికేం?

నాకు ఆసాడంతా మనసుసరిగా లేనేలేదు. పవలు కనుమూసినప్పుడుకూడా కలలూ కలవరింతలతో ... తేలిపోయినాను: అంతావింతగా ఉన్నది ... అనుభవంలేని ఈనూతనానుభవం:

"ఎక్కడికోయ్... నాయనా"...అని గుమ్మానికి అడ్డం తప్పుకుంటూ, అత్త ఆయన్ని అడిగింది ... తలుపులు దగ్గరగాలాగే ప్రయత్నం విధిలేక విరమిస్తూ..

ఆయన మ్యాగనోముపట్టినవాడిలాగా జవాబు చెప్పకుండా,... చుట్టూనిలబడినవాళ్లను దూసుకుని... చక్కాబోయినారు. అంతకుముందు నవ్వుతూ తుళ్లుతూ రాచకార్యములు చేస్తూన్న మావాళ్లందరూ చోద్యపడి ... తెల్లబోయినారు. అందరూవచ్చి మాగదిగుమ్మం దగ్గిర మూగారు: కాని, నన్ను ఎవరూ పలుకరించరు: ఒకరితో ఒకరైనా మాటాడుకోరు. ఆనిశ్శబ్దం పది నిమిషాలు ... భరించలేకపోయినాను.

లేచి నెమ్మదిగా...తలవంచుకుని, సిగ్గుతో... కోపంతో...అమితవ్యథతో....గుమ్మం దగ్గరకు వచ్చి మనసుకుదుటపరచుకుని నవ్వుతూ ఏదోవేళాకోళం విసురుతో...సంభాషణ ప్రారంభంచేసి...స్థితి వాళ్లు మరచిపోయేటట్టు చేయాలని యత్నించాను.

కాని వేసిన ఎత్తు పారకపోగా...బెడిసికొట్టింది. మా అత్త పరిహాసపు నిష్ఠురంతో -'ఆఅమాయకుడికి ఈ చిత్రాంగి ఏదో మంత్రించిందమ్మా; బెదిరి, చూడగానే పరు7త్తుకు పోతున్నాడు...'. అనేసింది. ఆవిడ... నవ్వులాటకుఅన్నా...వజ్రాఘాతంలా అరుంతుదమైంది. మంత్రించకలిగిన శక్తే కనుక నావద్ద ఉంటే...నాకను జాడల్లో మెలగకుండా...ఆయన్ను ఆలా తప్పించుకుపోనిచ్చేదాన్నా? నామనసులో కల్లోలం ... వాళ్లకు ఏలా అభివ్యక్తమౌతుంది?

'నీకూడా కావాలా. ఏం...ఆమంత్రం?' అని మాటకు మాటగా అనక తప్పిందికాదు. ఊరకుంటే వాళ్లుకూడా నాతోపాటు దిగులుపడతారేమోననిపించింది. నేను నవ్వుతెచ్చిపెట్టుకుని...వాళ్లందరినీ నవ్వించాను.

నవ్వుకుంటూ నవ్వుకుంటూన్న వాళ్లమందరమూ గప్‌న ఆగిపోయి ఒక్కసారిగాలేచి నిలుచున్నాము. నేను అమ్మచాటుకు తప్పుకున్నాను. మెట్లమీద పదధ్వని...ఆయన వస్తున్నారు. వీళ్లందరూ.....ఎంత అపోహపడి వృథాగా (మనసులోనే అనుకో) ఆడిపోసుకున్నారు! ఎందుకోసం క్రిందికి వెళ్లారో? - నన్ను వదిలి పోవడానికి...ఆయనకు మనస్కరిలేకనా? ఎంత బింకానికిపోయినా....ఉండగలరా విడిచి?...ఎవరికోసం వస్తారు?

వచ్చింది...ఆయనకాదు నాన్న! ...

వెనుకనుంచి వస్తున్నారేమోననుకున్నాను. లేక నాన్న పైకి వెళ్లాడుకదా అని, తాముకూడా అప్పుడే రావడానికి బిడియపడి...కొంచెం ఆగారేమో?

నాన్న మా అందరికంకా ఓమూగు చూసి తనలో తాను...ఎవరినీ ఉద్దేశించకుండా - 'వెర్రివేషాలు! ఊరుకుంటూన్న కొద్దీ మరీ హద్దుమీరి పోవడమేనా' అని కొంచెం ధూకుడుగా...సణుగుకొన్నారు. ఎవరికీ విషయమేమిటో బోధపడకపోయినా ఏమోనని భయపడి...ప్రాణాలు బిగబట్టుకున్నట్టు తోచారు. నామటుకు వణుకు పుట్టుకొచ్చింది—అపరాధమేమి చేశానో అని

'అతను...ఏంచేస్తున్నాడు, - ఇంతకుముందు క్రిందికి వచ్చాడే..., అని అత్త ధైర్యంచేసి అడిగింది. నాన్న కోపాలూ తాపాలూ...ఆవిడమీద పనిచేయవులే అసలు...

నాన్న...గర్జన ధోరణిలో 'ఎవరో...సరస్వతీ అమ్మాళ్...భరతాభినయం చేస్తుందట...పిక్చర్ పాలెస్‌లో, అక్కడకు దయచేశాడు...'అన్నారు.

అత్తా, అమ్మా...యావన్మందీ...నివ్వెరపోయినారు!

'అదేమిటి,... ఇవ్వాళే వెళ్లాలా? ... మా బాగుంది!...' — అని భావ్య - ఉపోద్ఘాతం మొదలు వేసింది...అత్త.

'అవునమ్మా: ఆయన, మరి, నీలాగా నాలాగా అనుకున్నావేం?— కవి,...అందులో బాగాముదిరిన భావకవి. ఇక, ఇల్లూవాకిలీ, పెళ్లాన్నీ కనిపెట్టుకుకూర్చునేటంత అవసరంఏంవచ్చింది? అవన్నీ ... నాలాటి ప్రాకృతులకి! వాళ్లు మహానుభావులు!... మేఘాలరహదారినితప్ప ... కటికి నేలనునడవరు: చుక్కకన్నెలను తప్ప... ఇంకొకరిని కన్నెత్తిచూడరు:కోవెలను తప్ప... పలుకరించరు: అక్కడ, శుభమంటూ కళాజలసా జరుగుతూంటే,... మదరాస్‌నుంచి వాలిన నవమోహిని అభినయం చేయబోతూంటే... ఇంటిదగ్గర ఉండమంటావూ? బలేదానవు!...'

—నాన్నలోకూడా. గడుసుదనంతోపాటు... ఇంతకవిత్వం ఉన్నదని... ఇదివరకు ఎన్నడూ అనుకోలేదు నేను. విన్నకొద్దీ, ఆయనమాటలకు ఆశ్చర్యం, నాకు అనుగతం చేసుకొన్నప్పుడు దిగులూ... కలిగినవి:

'పోనీ, వెళ్లేవాడు ఫలానా చోటికని చెప్పివెళ్ల వచ్చునుగా?... ఎందుకువెళ్లాడో తెలియదాయెను... ఏమైనాడో...'

—అమ్మమాటకు అడ్డువచ్చి... నాన్న:

'అవును: మీతో ఎందుకు చెప్పాలీ? దర్జాకు లోపంకాదూ? మిమ్మల్ని అడిగి ... అనుమతి పుచ్చుకు వెళ్లడానికి... ఏమంతఅవసరం... ఆయనకి?... మీకు తెలియజెప్పడానికీ... అన్నింటికీ, కూతుర్ని యిచ్చుకున్న గులాపువాణ్ని ... నేనుఉన్నానుగ!'—అని అనేసి... గిరుక్కున తిరిగి క్రిందకువెళ్లిపోయినాడు...

నాకు... తల దిమ్మెత్తిపోయింది:- ఒక్క దూకున, తూలుతూ వెళ్లి ... గదిలో మంచంమీద తలగడలు కముచుకుని బోర్లపడుకున్నాను. కదులుతూ ఉండటంచూచి— వెక్కి వెక్కి ఏడుస్తున్నాననుకుంది కాబోలు — అత్త దగ్గరగావచ్చి... తలనిమురుతూ, సమాశ్వసించే హెచ్చరికతో... 'ఊరుకోతల్లీ!...'— అన్నది అనలేని ఆయాసంతో:

నవ్వుమొగం ఆమెకుచూపించి—' ఏం లేదు, అత్తా,... ప్రొద్దుపోతున్నదికాదూ, నిదుర జోగిపోతూంది...'— అని ప్రసన్నంగా చెప్పేసరికి, ఆమె శంకించకుండా వెళ్లిపోయింది:

అందులో అభినయంఏమీలేదు. అప్పుడు భావనాశూన్యమై, మెదడు ... ఖాలీ అద్దంలాగా ఉండిపోయింది. ద్వంద్వరహితుల సాక్షాత్సమాధియోగం... సంక్రమించిందనుకుంటాను... సమానప్రతిపత్తి మూలకంగా! ఆలోచనలు ఏమైనా ఉండటానికి... మనసు అనేదే ఒకటిఉన్నదని... మరచిపోయినానుకాదూ...

—ఎపుడు నిదురపట్టిందో తెలియదు. ఆయన నామంచందగ్గరకు వచ్చి, చెక్కిలిమీద చెయివేసి, వంగి ముద్దిడుకోబోయి...!—కలో...నిజమో...తెలియదు. చూచినంతవ్యక్తతతో ... అనుభవించినట్లు అయింది: కాని. మెలకువకాలేదు.

...ఎండఎక్కిన తర్వాత...కనులు తెరిపిలిపడ్డవి. ఎన్నడూలేనిది...ఎందుచేతనో అంతసేపు నిద్రపోయినాను...

ఎదురుగా...గుమ్మం, ఓరవాకిలిగా అగుపించింది. లోపల ఒక్కరైనా...ఎవరు బంధించుతారు?

నిలువటద్దం వారనూ, సోఫామీద...ఒత్తిగిలి—ఆయన పడుకుని ఉన్నారు. పక్కన,...సగముక్రిందకు జారి, చిందరవందరగా పడివున్న ఉత్తరీయం...

ఇంకా కలయేనేమో?...అయితే, మరి...నిజం ...ఏది?—అనిపించింది.

పడిపోయిన పర్సును, ఆయనకు కదలిక కలుగకుండా...దిండ్లచాటున పెట్టి, శుభ శకునముతో,... (రాత్రి ఆయనసాన్నిధ్యానికైనా నోచుకోలేదుకా మరి...) – నిద్రమేల్కొంచిన ఉత్సాహ విభ్రమంతో ...క్రిందకు చెంగున వచ్చేశాను.

*   *   *   *

—ఆ...మరునాడు:

పవలు...దాని అమ్మకడుపు చలువను...దానంతట అదే గడచిపోయింది...నా ప్రమేయమేమీ లేకుండానే.

భోజనంముందు నాన్న - ఆయనా...సరదాగా కబుర్లు చెప్పుకోవడం—లోపలి సావడిలోకి మాకు వినిపించింది. నాన్న ఆయనమాటలు వింటూ...ఆప్యాయనంగా నవ్వుతున్నాడు. అవును: ఈ మగవాళ్లందరూ...ఇదే మచ్చు!

"...నీవు ఎరుగవోయ్ ... నగరాజకుమారి అని అఖండురాలు: ఛత్రపురిజావళీలన్నీ ... సుబ్బారావు...డా నిమీద చెప్పినవే! భరతవిద్యలో మాంచి నిధి. మనిషి ... అంతరూపసి కాదు కాని..."

...అంటూ, నాన్న తనచిన్నతనపు ముచ్చటలు అల్లుడితో చెపుతున్నాడు. ఆయన తందానా అంటూ తన స్వవిషయం...ప్రజ్ఞా ... నివేదించుకుంటున్నారు: మధ్యమధ్య...ఇద్దరూ ఏక శ్రుతిలో నవ్వుకుంటున్నారు. ఏం అన్యోన్యం!...ఎంత ఐకమత్యం! ... ఎంతచెడ్డా జామాత విష్ణుసముడాయెను....

...తరువాత, ఏముందీ-...మళ్లా ఎప్పటిపాటే:

...శయ్యాగృహంలో ... రాత్రివేళ ... సఖీవహివరః... సాచైవాస్మి ... తథాపి...మామయ్య గీర్వాణం నాకుకూడా పట్టినట్లుంది—ఏమీ అనుకోమోకేం?

ఇకమీదటి కథమాత్రం ... కొత్త సొబగుతో, రమ్యవైఖరిని ... మొదలైంది:

"తధిగణతోం..."... అని పరమకొంటెగా... నేను మంగళాచరణం చేశాను... ఆయనకు అందుబాటుగా నిలుచుని...నవ్వుతూ... త్రిభంగిగా...

సోఫాలో, కాలుజాచుకుని ... వాలి, సిగరెట్ ముట్టించినవారల్లా ... రింగులురింగులుగా పొగవదులుతూ, కాంతుమెరిసిపోయే చూపులతో నన్ను కరగించివేస్తూ ... మోచేయానుకుని...లేచి: ... 'అభినయించబోతున్నావా ... ఏం?'...అన్నారు.

'...ఆనందించడానికి ... మీరు ఉన్నారు కాదూ...?'—నా జవాబులో...ఏమున్నా తోణికానను కున్నావా ఏం? ఈ విపరీతం ... మామ్మలాటివింటే, కులపాలికలకు తగదని గర్హిస్తుంది కాని,—పెనిమిటి దగ్గర సిగ్గుపడవలసిన అవసరం...నాకేమీ కనిపించలేదు...

'మరి...బహుమానం?'

...అమ్మమ్మో! ఈమాట ఎంతజాలిగా అన్నారనుకున్నావు. అమాయకుడని అనుకుని...ఎంత పొరబడ్డాను! నామీద ప్రేమలేదనుకుని... ఎంతపరితాపపడినాను...అంతకు ముందు?

బహుమానం...ఏదో, నాకన్న ముందుగానే గ్రహించిన మనస్సు,...నన్ను ముందరికి తోసేసింది: పెదవి...కంపించిపోయింది—ప్రప్రథమాన మర్యాద తనకు జరుగదేమోననే ఆతురతతో...

జాచినకాలితో వడివేసి...దగ్గరకు లాక్కున్నారు. తామరతూడులా...అవళనై ...పరవశిల్లి... ఆయనసరసను...మీదకు వాలిపోయినాను:

కౌగలించుకోబోతున్నారు! ...అంతలో, అంతకుముందు నన్ను ఆవహించిన అలసత్వం...మంచు

లాగా విరిసిపోయింది. అప్పుడే, ఆయనకౌగలిలో... చిక్కడమే? అదీగాక, ఇన్నాళ్లనుంచీ నన్నుగికురించిన వెన్నెలకు...నావిజయ ప్రతాపం చూపించవద్దూ?... నిస్పందమైన సోఫాకు ఎందుకు...ఆ అనుభవసత్కారం?...వెన్నెలలో తప్ప వశమైతే ... ఓడిపోయినట్లు కాదూ...

మెలికలారి ... తప్పించుకొని, దీపంవేసేసి... కిటికీదగ్గర వెన్నెలలోకి...లేడిమాదిరి రివ్వుమన్నాను. అడుగులో అడుగుగా ... ఆయన నన్ను తరుముకొని వచ్చి... (ఆహాడావిడిలో సిగరెట్ ... ఇక తన అధికారం సాగదని, తేజాన్ని ఉపసంహరించుకుని, ... అవజ్ఞను మోసుకుంటూ ఏమూలనో పడిఉండాలి:)... మెసలవీలులేకుండా ... భుజపంజరాన బంధించారు. కలసిమెలసి పోతూన్న మనసులులాగా, పరిష్వంగంలో ...నేను కరగి... ఆయన హృదయానికి హత్తుకు పోతున్నాను....

... ఉత్తర నిమేషాన ... భ్రమరకుమారుని తీయని విందు జరిగేదే!...కాని, బలీయసీ కేవల మీశ్వరాజ్ఞా...

నేను, పెనగులాడి, మోటగా విదిలించుకుని, ఆమూలనుంచి ... ఎదుటిమూలకు వెళ్లిపడి ... దీపం స్విచ్ వేసి, హైరానుతో, లజ్జతో ... దూరంగా నిలుచున్నాను:

ఆయన ఇదంతా సరస విహారమే ననుకొని ... సమీపించబోయినారు: నేను తెంపుచేసుకుని "వద్దు... రావద్దు..."... అని వారించాను. ఆయనకు అర్థంకాలేదు...

భాగ్యదేవత ... వెన్నెలతీగలతో ... నందనోద్యాన రహదారిగా నిర్మించిన సోపానపాళి.... ఒక్కమారుగా రూపడిపోయింది....

అని ఆయన అర్థంచేసుకోవాలికాని... ఎంతచనవైనా - ఎలా చెప్పడం ఆమాట?

రాత్రి అంతా ఏమనుకున్నారో...ఒంటరిగా ఎల్లా వేగించారో - ఎంతకష్టపడ్డారో...

నేను చీరచెరగు పెదవులకు చాటుచేసుకుని, కనులతో...జవాబుచెప్పాను - దగ్గిరకు రాకూడదని. ఇక ఆయనవంక చూడలేక, చూసి నిలువలేక...ఇవతలకు వచ్చేశాను...

జరీచీరచెరగు ప్రత్యేకం రసభంగం చేయడానికే కాకపోతే......మాయడానికి ఏం వేరే సబబు ఉన్నదీ?

* * * *

చూశావా?...నీవు...ఇంత ఓపికతో చదివినందుకు కథ ఏలాగైతే నేం...కంచికివెళ్లింది!

అర్థమయింది కాదూ?...నేను కాపురానికి వెళ్లానుకాని...ఇంకా కాపురం చేయలేదు అని: నాకు ఏమీ కించలేదు: మూకురోజులూ....యుగములబరువు మోసినవే అనుకో...మరి ఆమరునాడు...మాకు అడ్డు ఏమి ఉన్నదీ?...

ఇదిగో ఇప్పుడే చెప్రతున్నాను మళ్లా ఈమారు వ్రాసే ఉత్తరంలో మీగతా ముచ్చటలన్నీ...ఇలాగే భారతంలాగా...అల్లుతానని, చదివి పొంగిపోవచ్చుననుకొని, ఆసపెట్టుకు కూర్చుంటావేమో?... ఇక ఎక్కడి దొంగలు...అక్కడే: గప్‌చిప్...

—మీచిట్టిబాబుకు... పూర్ణ - అత్తయ్యపంపిన బహుమతీ అని ... ఓచిన్ని జెల్లాఇవ్వు. లేకపోతే, అడపాదడపా కొంచెం చురుకుతగలకపోతే.... మీ మామగారిలాగా వినాయకుడౌతాడు. మోయలేక... రేపు... రాబోయే ఎలుకపిల్ల... కీచ్‌కీచ్‌లాడుతుంది! ఏం... అంతేకాదూ?

ఉన్నవీ లేనివీ— కల్పించిఅయినా,— (మా అన్నగారిమీద నేరాలుచెప్పడమంటే నీకుఒళ్లుపోతుంది కాదూ...)— ఇంతఉత్తరమూ తిరుగుమెయిల్‌లో నీదగ్గరనుంచి రాకపోతే,— ఇక ఇంతే!—సావాసం కొట్టివేస్తాను: కాచుకో...

తప్పకవ్రాస్తావుకదూ?... ఉంటాను ఇక...

సంపూర్ణ మోహిని.